
ఆవులవారిపాలెం రామాలయం వద్ద ఆర్ అండ్ బీ రోడ్డు దుస్థితి


బొద్దులూరుపాడు రోడ్డులో తటాకాలను తలపించేలా ఉన్న రహదారి


దోనేపూడి-పోతార్లంక మార్గంలో అడుగుకో గుంతతో రహదారి

రోడ్లు ఇలా.. ప్రయాణం ఎలా..!?

- దుర్భర స్థితిలో రహదారి వ్యవస్థ
- రాకపోకలకు ప్రజలు తీవ్ర అవస్థలు
- వర్షం నీరు నిలిచి తటాకాలను తలపిస్తున్న రోడ్లు


గాజుల్లంక-పోతార్లంక మార్గంలో ఛిద్రమై ప్రమాదకరంగా మారిన ఆర్ అండ్ బీ రోడ్డు

కొల్లూరు: రహదారి వ్యవస్థ మెరుగైతేనే గ్రామీణ, పట్టణ ప్రాంతాల అభివృద్ధి వేగవంతమవుతుందన్న కనీస సూత్రాన్ని కూటమి ప్రభుత్వం విస్మరించడంతో రహదారులు ప్రాణాలను హరించే మాయదారులను తలపిస్తున్నాయి. మండలంలో ప్రధాన రహదారులు, అంతర్గత రహదారులు అడుగుకో గుంతతో ప్రయాణానికి పనికిరాని విధంగా తయారయ్యాయి. రోడ్ల నిర్మాణ విషయంలో పల్లె పండుగ పేరుతో ప్రగల్భాలు పలికిన కూటమి ప్రభుత్వం మీన మేషాలు లెక్కిస్తుండటంతో నడవడానికి సైతం పనికిరాని విధంగా రోడ్లు అధ్వానంగా తయారయ్యాయి. గుంతల్లో వర్షం నీరు నిలిచి తటాకాలను తలపిస్తున్న రోడ్లలో విద్యార్థులు, ప్రజలు, వాహన చోదకులు రాకపోకలు సాగించడానికి అష్టకష్టాలు పడుతున్నారు. మొనదేలిన గులక రాళ్లు, లెక్కకు మించిన భారీ గుంతలతో రోడ్లు ఉండటంతో ప్రయాణికులు ప్రమాదాలకు గురవుతున్నారు. చిన్నపాటి వర్షాలకే వారాల తరబడి తటాకాలను తలపించేలా రోడ్లపై నిలిచిన వర్షపు నీటిలో వాహనదారులు పడుతున్న బాధలు వర్ణనాతీతమని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

మండలంలో ఇలా...

- మండలంలోని బొద్దులూరుపాడు నుంచి కొల్లూరు చేరుకోవడానికి ఉన్న ఏకైక మార్గం మోకాలు లోతు గుంతలతో వర్షాలు పడిన సమయంలో చెరువులను తలపిస్తుంది.
- ఆవులవారిపాలెం రామాలయం వద్ద మరమ్మతులు చేపట్టిన రోడ్డు మూడు నెలల వ్యవధిలోనే దెబ్బతినడంతో ఆ ప్రాంతంలో భారీ గుంతలు ఏర్పడి వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు.
- గాజుల్లంక నుంచి పోతార్లంక వెళ్లే మార్గంలో ఇటుక బట్టీల నిర్వాహకులు వర్షపు నీరు రోడ్లపై నుంచి కళ్లాల్లోకి రాకుండా ఏర్పాటు చేసిన మెరకల కారణంగా రహదారి వ్యవస్థ గాడి తప్పింది. కోతలకు గురైన మార్గంలో రాకపోకలు సాగించే ప్రయాణికులు, వాహనదారులు ఏమాత్రం ఆదమరిచినా 10 అడుగుల పల్లపు ప్రాంతంలోకి దూసుకుపోయి ప్రాణాలు కోల్పోయే ముప్పు పొంచి ఉంది.
- దోనేపూడి-పోతార్లంక రహదారి సైతం అడుగుకో గుంతతో అధ్వానంగా తయారవడంతో ఈ మార్గంలో రాకపోకలు సాగించే పది గ్రామాలకు చెందిన ప్రజలు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. ఛిద్రమైన రహదారి వ్యవస్థను మెరుగుపరిచి ప్రయాణ కష్టాల నుంచి గట్టెక్కించాలని ప్రజలు కోరుతున్నారు.

క్లుప్తంగా

రహదారి గుంతలను పూడ్చాలని వినతి



భట్టిప్రోలు: భట్టిప్రోలు నుంచి పెదపులివర్రు వయా అక్కివారిపాలెం ఆర్ అండ్ బీ రహదారిలో ఏర్పడిన గుంతలు పూడ్చి ప్రయాణికులకు ఇబ్బందులు లేకుండా చూడాలని కౌలు రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు గోళ్ల నాగరాజు సోమవారం స్థానిక కార్యాలయంలో తహసీల్దార్ మేకా శ్రీనివాసరావుకు వినతిపత్రం అందజేశారు. భట్టిప్రోలు రైల్వే గేట్ నుంచి రైల్వే స్థలంలో వేసిన రోడ్డు బాగా గుంతలు పడి ప్రయాణికుల అవస్థలు అన్నీ ఇన్నీ కావని పేర్కొన్నారు. పెదపులివర్రు రహదారిలో మూసివేసిన రైల్వే గేట్ వద్ద నుంచి మురుగు కాల్వ వరకు గుంతలు పడ్డాయని వాపోయారు. ఈ మార్గంలో పెనుమూడి వైపు రహదారి దగ్గర మార్గమని తెలిపారు. ప్రయాణికుల ఇబ్బందులు దృష్టిలో పెట్టుకుని సంబంధిత అధికారులు సమస్యను పరిష్కరించాలని కోరారు.

పీసీఆర్, పీవోఏ కమిటీ సభ్యునిగా భగవాన్‌దాస్ నియామకం



భట్టిప్రోలు: బాపట్ల జిల్లా కలెక్టర్ చైర్మన్‌గా పౌర హక్కుల సంరక్షణ చట్టం (పీసీఆర్), ఎస్సీ, ఎస్టీ అత్యాచార నివారణ చట్టం (పీవోఏ) కమిటీకి బాపట్ల జిల్లా విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యుడిగా భట్టిప్రోలుకు చెందిన వేము భగవాన్ దాసును నియమితులయ్యారు. బాపట్ల జిల్లా జాయింట్ కలెక్టర్ గంగాధర్ గౌడ్ చేతుల మీదగా నియామకపు పత్రాన్ని సోమ వారం ఆయన అందుకున్నారు. ఈ సందర్భంగా భగవాన్ దాస్ మాట్లాడుతూ జిల్లాలో అణగారిన వర్గాల హక్కుల పరిరక్షణ, అభివృద్ధి కొరకు తన వంతు కృషి చేయనున్నట్లు పేర్కొన్నారు. ఆయన ఎస్ఎఫ్ఐ మాజీ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా పని చేశారు. ఆయనను అంబేడ్కర్ యూత్ సభ్యులు పలువురు అభినందించారు.

హిందూ ధర్మం సనాతనమైనది



కర్లపాలెం: హిందూ ధర్మం సనాతమైనదని బాపట్ల జిల్లా ధర్మ ప్రచారక్ జంజనం హేమశంకరరావు చెప్పారు. సమరసత సేవా ఫౌండేషన్ సభ్యుల సమావేశం సోమవారం కర్లపాలెం శివాలయంలో జరిగింది. ఈ సమావేశంలో హేమశంకరరావు మాట్లాడుతూ హిందూ ధర్మాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత హిందువులందరిపై ఉందని చెప్పారు. ఈ నెల 7వ తేదీన వాల్మీకి జయంతిని, పౌర్ణమి కార్యక్రమాలను ఘనంగా జరుపుకోవాలని ఆయన కోరారు. కార్యక్రమంలో సమరసత సేవా ఫౌండేషన్ మండల కన్వీనర్ నందిపాటి నాగమల్లేశ్వరరావు, సభ్యులు ఉన్నారు.

సమాజ సేవలో ఆర్ఎస్ఎస్ పాత్ర కీలకం



ఖాజీపాలెం(కర్లపాలెం): సమాజ సేవలో ఆర్ఎస్ఎస్ పాత్ర కీలకమైనదని ఏపీ సక్షమ్ కార్యవాహ కృష్ణమోహన్ తెలిపారు. రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్(ఆర్ఎస్ఎస్) శతాబ్ది మహోత్సవాల సందర్భంగా పిట్టలవానిపాలెం మండలంలోని ఖాజీపాలెం కాశీవిశ్వనాథుని దేవాలయంలో సోమవారం ఆర్ఎస్ఎస్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో కృష్ణమోహన్ మాట్లాడుతూ యువత దేశ సేవ కోసం ముందుకు రావాలని పిలుపునిచ్చారు. అందరూ సమాజ నిర్మాణానికి అంకితం కావాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో ఆర్ఎస్ఎస్ జిల్లా కార్యవాహ గోపి, గోకరాజు సుబ్బరాజు, బాపట్ల ఖండ కార్యవాహ బాలాజీ, బాపట్ల ఖండ కళాశాల ప్రముఖ్ పరిమి శరణ్, పిట్టలవానిపాలెం మండల సంఘ్ ప్రముఖ్ అనంత చక్రవర్తి తదితరులు పాల్గొన్నారు.

క్షయవ్యాధిపై అవగాహన కలిగి ఉండండి

తెనాలిఅర్బన్: క్షయ వ్యాధిపై అందరూ అవగాహన కలిగి ఉండాలని ఎయిమ్స్ జూనియర్ రెసిడెంట్ వైద్యులు డాక్టర్ విగ్నేష్ పేర్కొన్నారు. కొలవరం గ్రామంలో క్షయ వ్యాధిగ్రస్తులకు సోమవారం స్క్రీనింగ్ నిర్వహించారు. క్షయ మందులు వాడే వారితో పాటు వారి కుటుంబ సభ్యులకు పరీక్షలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మందులు వాడిన వారిలో వ్యాధి నిరోధక శక్తి లోపిస్తుందని, తద్వారా మళ్లీ క్షయ వ్యాధి వచ్చే అవకాశం ఉందన్నారు. రెండు సంవత్సరాల నుంచి మందులు వాడిన ప్రతి ఒక్కరికీ స్క్రీనింగ్ చేయడం జరుగుతుందన్నారు. టీబీ యూనిట్ సూపర్‌వైజర్ పల్లెకొండ రవికుమార్ మాట్లాడుతూ క్షయ వ్యాధి చికిత్స పొందిన వారికి ప్రతి ఆరు నెలలకు స్క్రీనింగ్ చేయడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో హెచ్‌వి ఝాన్సీలక్ష్మీ, ఏఎన్ఎంలు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

రైతులకు న్యాయం చేయాలని వినతి



కొల్లూరు: ఖరీఫ్‌లో సాగు చేసిన వరి విత్తనాల వల్ల తమకు ఏర్పడుతున్న నష్టం నుంచి న్యాయం చేయాలని రైతులు ప్రజా సమస్యల పరిష్కార వేదికలో అధికారులను వేడుకున్నారు. సోమవారం కొల్లూరు రెవెన్యూ కార్యాలయంలో మండలంలోని అనంతవరంకు చెందిన రైతులు తహసీల్దార్ బి.వెంకటేశ్వర్లు, ఏవో నరేంద్ర కుమార్‌లను కలిసి వినతి పత్రం అందజేశారు. ఖరీఫ్ సాగుకు అవసరమైన వరి విత్తనాలను అనవంతవరంకు చెందిన రైతులు కొల్లూరు ప్రసాద్ ఏజెన్సీలో ఈ ఏడాది జూన్ 20న కొనుగోలు చేశారు. ఎస్ఆర్ఐ కంపెనీకి చెందిన బీపీటీ 5204 రకం విత్తనంను పొలంలో సాగు చేయగా ఆ విత్తనాలకు తాలు వరి కంకులు (కేళీలు) రావడంతో రైతులు నివ్వెరపోయారు. నాశిరకం విత్తనాల కారణంగా ఎకరాకు సుమారు 5 క్వింటాళ్ల వరకు దిగుబడి తగ్గి నష్టం వాటిల్లనుందని రైతులు అధికారుల వద్ద మొరపెట్టుకున్నారు. తమకు వాటిల్లుతున్న నష్టాన్ని దృష్టిలో ఉంచుకొని అధికారులు స్పందించి న్యాయం చేయాలని కోరారు.

మురుగు కాల్వలను నిర్మించండి

తెనాలిఅర్బన్: మురుగు కాల్వలు లేక అనేక ఇబ్బందులు పడుతున్నామని, వెంటనే వాటిని నిర్మించే విధంగా చూడాలని 3వ వార్డుకు చెందిన పలువురు మున్సిపల్ కమిషనర్ జాగారపు రామ అప్పలనాయుడుకు వినతిపత్రం ఇచ్చారు. ప్రజా సమస్యల పరిష్కార వేదికను మున్సిపల్ కార్యాలయంలో సోమవారం నిర్వహించారు. 32వ వార్డులో స్ట్రీట్ లైట్లు బాగు చేయాలని, మున్సిపల్ స్థలంలోని అక్రమణలు తొలగించాలని పలువురు వినతిపత్రం ఇచ్చారు. అన్నింటిని పరిశీలించి చర్యలు తీసుకుంటామని హామీఇచ్చారు. డీఈలు ఆకుల శ్రీనివాసరావు, శ్రీనువాసులు, కె.శ్రీనివాసరావు, ఏసీపీ వాణి పాల్గొన్నారు.

సూపర్ జీఎస్టీ- సూపర్ సేవింగ్‌పై విద్యార్థులకు అవగాహన

రేపల్లె: భారత ఆర్థిక వ్యవస్థ బలోపేతానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఏబీఆర్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ టీసీ రవిచంద్ర కుమార్ అన్నారు. సూపర్ జీఎస్టీ- సూపర్ సేవింగ్ క్యాంపైన్‌లో భాగంగా పట్టణంలోని ఏబీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో కామర్స్ విభాగం ఆధ్వర్యంలో విద్యార్థులకు సోమవారం నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన పాల్గొని మాట్లాడారు. పన్నులు సక్రమంగా చెల్లించినట్లయితే ప్రభుత్వానికి ఆదాయం సమకూరి దేశాన్ని అభివృద్ధి పథంలో నడిపించేందుకు అవకాశం సుగమం అవుతుందని పేర్కొన్నారు. పన్నులు సక్రమంగా చెల్లించని వారు చట్టపరంగా నేరస్తులేనన్నారు. నూతన జీఎస్టీ 2.0 విధానం వ్యాపారులు, పేద, మధ్య తరగతి వర్గాలకు ఉపయోగకరంగా ఉంటుందన్నారు. విద్యార్థి దశ నుంచే ఆర్థిక అక్షరాస్యతపై పట్టు సాధించాలని, కొనుగోలు చేసే ప్రతి వస్తువుకు రశీదును పొందాలని సూచించారు. పన్నులు సకాలంలో చెల్లించటంతో దేశం అభివృద్ధి బాటలో పయనిస్తుందన్న అంశంపై అవగాహన కలుగుతుందని అన్నారు. ఈ సందర్భంగా కామర్స్ అధ్యాపకుడు డాక్టర్ పి.మురళి జీఎస్టీ 2.0 విధి విధానాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.


విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న అధ్యాపకుడు మురళి


జీఎస్టీపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఎంపీడీవో శ్రీనివాసరావు

జీఎస్టీపై విద్యార్థులకు అవగాహన

కర్లపాలెం: కేంద్ర ప్రభుత్వం జీఎస్టీ తగ్గించటం వలన నిత్యావసరాల ధరలు సామాన్యులకు అందుబాటులోకి వచ్చాయని ఎంపీడీవో అద్దూరి శ్రీనివాసరావు చెప్పారు. కర్లపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు సోమవారం ఎంపీడీవో శ్రీనివాసరావు జీఎస్టీపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం జీఎస్టీ తగ్గించటం వలన నిత్యావసరాల ధరలతో పాటు ఎలక్ట్రికల్ వస్తువులు, కార్లు, బైక్‌ల ధరలు కూడా తగ్గాయన్నారు. ఈ కార్యక్రమంలో ఈవోపీఆర్డీ ఐ.శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు ఉన్నారు.

భట్టిప్రోలు: జీఎస్టీ 2.0 సంస్కరణల ప్రయోజనాలపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు సూపర్ జీఎస్టీ-సూపర్ సేవింగ్స్ పేరుతో సోమవారం భట్టిప్రోలు రథం సెంటర్‌లో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వేమూరు ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు జీఎస్టీతో లభించే పన్ను సదుపాయాలు, వ్యాపార సౌలభ్యం, పారదర్శకత, ఆర్థిక లాభాలు వంటి అంశాలను తెలియజేశారు. దుకాణాలు, ఇంటింటికి వెళ్లి కరపత్రాలను ఆయన పంపిణీ చేశారు. కార్యక్రమంలో రైతులు, మహిళలు, యువత, వ్యాపారులు, తహసీల్దార్ మేకా శ్రీనివాసరావు, కూటమి నాయకులు, ప్రజా ప్రతినిధులు గొట్టిపాటి పూర్ణకుమారి, తూనుగుంట్ల సాయిబాబా, ఊసా రాజేష్ తదితరులు పాల్గొన్నారు.


జీఎస్టీపై అవగాహన కల్పిస్తున్న ఎమ్మెల్యే ఆనందబాబు

నాగేశ్వరరావుకు సర్వేపల్లి రాధాకృష్ణన్ ప్రతిభ పురస్కారం

చెరుకుపల్లి: కాటూరు నాగేశ్వరరావు డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ ప్రతిభ పురస్కారం అందుకోవటం అభినందనీయమని స్థానిక ఎంఈవోలు పులి లాజర్, టి.నవీన్‌కుమార్ అన్నారు. మండలంలోని ఆరేపల్లి ఎంపీయూపీఎస్ పాఠశాల ప్రధానోపాధ్యాయుడిగా పని చేస్తున్న కాటూరు నాగేశ్వరరావు అంతర్జాతీయ ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా గుంటూరు కేవీఆర్ అండ్ విజయలక్ష్మి ఎడ్యుకేషనల్ ట్రస్టు ఆదివారం వెంకటేశ్వర కళామందిరంలో నిర్వహించిన కార్యక్రమంలో ఈ అవార్డును అందుకున్నారు. ఈ సందర్భంగా సోమవారం ఎంఈవోలు కాటూరు నాగేశ్వరరావును అభినందించి, మాట్లాడుతూ విద్యార్థులకు మంచి విద్యను అందించటంతో పాటు పలు సాంస్కృతిక కార్యక్రమాలు, ముఖ్యంగా మండల, జిల్లా, రాష్ట్ర స్థాయిలో మ్యాజిక్ షోలు నిర్వహించి అనేక జాతీయ అవార్డులు పొందారని అన్నారు. నాగేశ్వరరావు జన విజ్ఞాన వేదిక మండల అధ్యక్షుడిగా, రాష్ట్ర మ్యాజిక్‌కో ఆర్డినేటరుగా పని చేస్తున్నారన్నారు. ఈ అవార్డును మాజీ ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావుతో పాటు ఏపీ హయ్యర్ ఎడ్యుకేషన్ వైస్ చైర్మన్ ప్రొఫెసర్ కె.రత్నషీలామణి, ఎమ్మెల్సీ బి.గోపిమూర్తి, డాక్టర్ ఆలా వెంకటేశ్వర్లు, యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు నక్కా వెంకటేశ్వర్లు, తవ్వా సురేష్, వీర ప్రకాష్ తదితర ప్రముఖుల చేతుల మీదుగా అందుకోవటం మండలానికే గర్వకారణమని ఎంఈవో లాజర్ అన్నారు. నాగేశ్వరరావును స్థానిక ఎంపీడీవో షేక్ మహబూబ్ సుభాని, జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత ఇంకొల్లు రంగారావు, ఉపాధ్యాయులు సాంబయ్య నాయక్, తాతా సుబ్బరావు, అక్రమ్ గోరి, నరసారెడ్డి, మరదాప కోటేశ్వరరావు, గోపికృష్ణ, చైర్మన్ గోవర్ధనరెడ్డి, వైస్ చైర్మన్ చీనమ్మ తదితరులు అభినందించారు.


డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ ప్రతిభ పురస్కారం అందుకుంటున్న నాగేశ్వరరావు

ప్రజా సమస్యల పరిష్కార వేదికకు ఏడు అర్జీలు

రేపల్లె: ప్రజలు తమ సమస్యలను పరిష్కరించుకునేందుకు ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆర్డీవో నేలపు రామలక్ష్మి చెప్పారు. స్థానిక ఆర్డీవో కార్యాలయంలో సోమవారం జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో ఆమె ప్రజల నుంచి అర్జీలు స్వీకరించి మాట్లాడారు. రేపల్లె మండలం మోళ్ళగుంట గ్రామానికి చెందిన పీత రవిచంద్రరావు గ్రామంలో డ్రైనేజీ సౌకర్యం, వైద్య సదుపాయం కల్పించటంతో పాటు మత్స్యకార భరోసా అర్హుల జాబితాపై విచారణ జరపాలని అర్జీ అందించారన్నారు. బేతపూడి గ్రామంలో ఎన్టీఆర్ విగ్రహం నుంచి తురకపాలెం రహదారి వరకు వీధి దీపాలు ఏర్పాటు చేయాలని గ్రామానికి చెందిన కాటూరి శ్రీనివాసరావు, భూములకు బండ్లబాట చూపాలని సింగుపాలెంకు చెందిన ఉయ్యూరి సాంబశివరావు, అరవపల్లిలో జరిగిన రీ సర్వేలో తన భూమికి ఏర్పాటు చేసిన సర్వే రాళ్లను గుర్తు తెలియని వ్యక్తులు తొలగించారని, వారిపై చర్యలు తీసుకోవాలని రేపల్లెకు చెందిన దామర్ల శ్రీనివాసరావు అర్జీలు అందించారన్నారు. స్థల సమస్యను పరిష్కరించాలని నిజాంపట్నం మండలం కళ్ళిఫలం గ్రామానికి చెందిన వల్లూరి వెంకటేశ్వరమ్మ, రజకుల సమస్యలు పరిష్కరించాలని భట్టిప్రోలు మండలం ఓటేరు గ్రామానికి చెందిన ఓలేటి వీరరాఘవయ్య అర్జీ చేసుకున్నారన్నారు. అదేవిధంగా తన కుటుంబం నుంచి తనకు రావాల్సిన స్థలం, మాగాణి భూమిలో వాటాని ఇప్పించాలని కోనేటిపురం గ్రామానికి చెందిన పడమట శివలీల ఫిర్యాదు చేశారన్నారు. అర్జీలను పరిశీలించి సంబంధిత శాఖ అధికారుల ద్వారా త్వరితగతిన పరిష్కరించటం జరుగుతుందని పేర్కొన్నారు.


అర్జీలను పరిశీలిస్తున్న ఆర్డీవో నేలపు రామలక్ష్మి

గాయాలతో ఉన్న క్షతగాత్రుణ్ని వైద్యశాలకు తరలింపు

కొల్లూరు: తలకు గాయాలతో రక్తం చిమ్ముతూ ఓ వ్యక్తి రహదారిపై పడి ఉండి ఆ మార్గంలో రాకపోకలు సాగించే వాహనదారులను సహాయం కోసం అర్థించిన ఘటన కొల్లూరు సమీపంలో గాంధీనగర్ వద్ద చోటు చేసుకుంది. బాధితుడు, ప్రత్యక్ష సాక్షుల కథనం మేరకు.. కృష్ణా జిల్లా చల్లపల్లికి చెందిన ఎం.శ్రీనివాసు తలకు గాయంతో రహదారిపై ఉన్నాడు. తనకు సహాయం చేయాలని కోరడంతో వేమూరు వైపు నుంచి వస్తున్న ప్రయాణికులు గమనించి 108 వాహనానికి, పోలీసులకు సమాచారం అందజేశారు. 108 వాహన సిబ్బంది, పోలీసులు గాయాలకు గల కారణాలపై సమాచారం సేకరించేందుకు ప్రయత్నించినా ఎటువంటి ప్రయోజనం లభించలేదు. అతని వద్ద ద్విచక్ర వాహనం సైతం లేకపోవడంతో అతనిని పలుమార్లు ప్రశ్నించగా, బస్సు దిగానని తనను ఎవరో కొట్టారని మాత్రం సమాధానం చెబుతున్నట్లు ప్రయాణికులు వెల్లడించారు. అయితే గాయాలతో ఉన్న వ్యక్తికి పోలీసుల సహకారంతో ప్రథమ చికిత్స అందించిన 108 సిబ్బంది వైద్యశాలకు తీసుకువెళ్లేందుకు తొలుత సంచయించి, అతని కుటుంబ సభ్యులతో ఫోన్‌లో మాట్లాడిన అనంతరం తెనాలి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. అయితే అక్కడ వైద్య సేవలు పొందకుండా ఆ వ్యక్తి వెళ్లిపోయినట్లు 108 సిబ్బంది వెల్లడించారు.


గాయాలతో ఉన్న క్షతగాత్రుడికి ప్రథమ చికిత్స చేస్తున్న 108 సిబ్బంది


ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన వ్యక్తి మృతి


మృతి చెందిన రాజేష్

కొల్లూరు: పురుగుల మందు తాగి ఓ వ్యక్తి ఆత్మహత్యాయత్నానికి పాల్పడి చికిత్స పొందుతూ మృతి చెందిన ఘటన ఆదివారం రాత్రి చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. మండలంలోని కిష్కిందపాలెంకు చెందిన మునిపల్లి రాజేష్ (30) ఆదివారం మధ్యాహ్నం పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. పంట పొలాల్లో పురుగుల మందు తాగినట్లు తెలుసుకున్న కుటుంబ సభ్యులు అతణ్ని చికిత్స నిమిత్తం తెనాలి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడి భార్య సరిత పంట నష్టం కారణంగా, ఆర్థిక ఇబ్బందులతో మనస్థాపానికి గురై పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడగా, చికిత్స పొందుతూ మరణించినట్లు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కొల్లూరు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. అయితే పంట నష్టం కారణంగా మునిపల్లి రాజేష్ ఆత్మహత్యకు పాల్పడ్డాడన్న విషయాన్ని రెవెన్యూ అధికారులు నిర్ధారించ లేదు. తహసీల్దార్ బి.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ, తమ విచారణలో మృతుడు ఎటువంటి వ్యవసాయం చేయడం లేదని వెల్లడైందని తెలిపారు.

హౌసింగ్ కాలనీ సమస్యలు పరిష్కరించాలి

కొల్లిపర: గుడిబండివారిపాలెం గ్రామంలోని హౌసింగ్ కాలనీ లోని మౌళిక వసతుల సమస్యలపై అధికారులు స్పందించి సమస్యలు పరిష్కరించాలని సీపీఎం నాయకుడు ములకా శివసాంబిరెడ్డి, కాలనీ వాసులతో కలసి సోమవారం రెవెన్యూ కార్యాలయం ముందు దర్నా నిర్వహించి, గ్రీవెన్స్‌లో డిప్యూటీ తహసీల్దారు రాజేష్, ఎంపీడీవో విజయలక్ష్మికి అర్జీ అందించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో విజయలక్ష్మి కాలనీని సందర్శించి మాట్లాడుతూ తక్షణమే రెండు లక్షల తో గ్రామెల్‌తో రోడ్డులు మరమ్మతులు, వీధిలైట్లు లేనిచోట కొత్తవి, వెలగిని చోట కొత్త లైట్లు ఏర్పాటు చేయటం, గడ్డి మందు, దోమల మందు పిచికారీ వెంటనే చేయమని పంచాయతీ కార్యదర్శి అలకనంద కు ఆదేశించారు. దీంతో కాలనీ వాసులు ఎంపీడీవోకి కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో చుండూరు పద్మ, పి.శ్రీలత, సయ్యద్ రెహానా, కె.దుర్గా, సొంటి శివనాగదుర్గ, ఎం.వెంకటేష్, మాచర్ల తులసిమ్మ, షేక్ సర్తాజ్, కె.వెంకటేశ్వరమ్మ, చందోలు పద్మ తదితరులు పాల్గొన్నారు.


కాలనీ పరిశీలిస్తున్న ఎంపీడీవో విజయలక్ష్మి

వృత్తి శిక్షణను సద్వినియోగం చేసుకోవాలి

ఐలవరం(భట్టిప్రోలు): దసరా సెలవుల్లో ఇంటర్న్‌షిప్ ద్వారా భట్టిప్రోలు మండలం ఐలవరం 10వ తరగతి విద్యార్థులు వృత్తి శిక్షణను సద్వినియోగం చేసుకోవడం అభినందనీయమని ఎంఈవోలు పులి లాజర్, నీలం దేవరాజ్‌లు పేర్కొన్నారు. సోమవారం స్థానిక హైస్కూల్‌లో జరిగిన కార్యక్రమంలో వారు మాట్లాడుతూ పాఠశాల స్థాయి నుంచే విద్యార్థుల భవితకు బాటలు వేసేలా సమగ్ర శిక్ష నిర్వహించిన వృత్తి శిక్షణ ఎంతగానో దోహద పడిందని తెలిపారు. ఐటి ట్రేడ్‌లో భాగంగా 10వ తరగతి విద్యార్థులకు ఐలవరం సచివాలయం కార్యదర్శి వక్కలగడ్డ సురేష్, పోస్టాఫీస్ సెంటర్ చంద్రశేఖర్, ఒకేషనల్ ట్రైనర్ వి.తిరుమలదేవి ఆధ్వర్యంలో గత నెల 22 నుంచి ఈ నెల 5వ తేదీ వరకు 11 రోజుల పాటు శిక్షణ తరగతులు జరిగాయి. ప్రధానోపాధ్యాయులు మాచర్ల మోహన్‌రావు, ఫిజికల్ డైరెక్టర్ తుమ్మా శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.


భట్టిప్రోలులోని పోస్టాఫీసులో శిక్షణ పొందుతున్న ఐలవరం విద్యార్థులు

ప్రజావసరాలు తీర్చే విధంగా పనిచేయండి

మున్సిపల్ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక

తెనాలిఅర్బన్: ప్రజల అవసరాలను తీర్చే విధంగా మున్సిపల్ అధికారులు పనిచేయాలని చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక ఆదేశించారు. 13వ వార్డులో సోమవారం కమిషనర్ జాగారపు రామ అప్పలనాయుడుతో కలిసి పర్యటించారు. 13వ వార్డులో నెలకొన్న పలు సమస్యలను కౌన్సిలర్ కుర్రా సుజాత వారికి తెలియజేశారు. రక్షిత మంచినీటి పైపులైన్ లీకులు, పారిశుద్ధ్య నిర్వాహణలో లోపాలను చూపించారు. వెంటనే వాటిని పరిష్కరించాలని చైర్‌పర్సన్ ఆదేశించారు. ఈ సందర్భంగా కమిషనర్ అప్పలనాయుడు మాట్లాడుతూ తెనాలి పట్టణంలో పారిశుద్ధ్య నిర్వహణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆరోగ్యాధికారి డాక్టర్ మొవ్వా యేసుబాబు, టీపీవో సాంబశివరావు, పలువురు ఏఈలు, మున్సిపల్, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

మతిస్థిమితం లేని వ్యక్తి ఏరియా వైద్యశాలలో హల్‌చల్



బాపట్ల టౌన్: బాపట్ల పట్టణంలోని ఏరియా వైద్యశాలలో మతిస్థిమితం లేని దినేష్ అనే వ్యక్తి సోమవారం రాత్రి హల్‌చల్ చేశాడు. బాపట్ల పట్టణ సీఐ రాంబాబు కథనం ప్రకారం బాపట్ల పట్టణంలోని శృంగారపురానికి చెందిన దినేష్ అనే వ్యక్తి మతిస్థిమితం లేకుండా ఉంటూ పలుసార్లు వ్యక్తిగతంగా తనకు తానే గాయపరుచుకుంటుంటాడన్నారు. సోమవారం పొట్టలో పొడుచుకుని ఏరియా వైద్యశాలకు వచ్చి కొద్దిసేపు హల్‌చల్ చేశాడని, వెంటనే ఔట్‌పోస్టు సిబ్బంది అతనిని అదుపులోకి తీసుకున్నారన్నారు. గతంలో కూడా ఒకసారి గొంతు కోసుకోవటం, మరోసారి ఎలుకల మందు తినటం వంటివి చేశాడని, అతని ఆరోగ్య స్థితి సరిగా లేకపోవటంతో వైద్యుల సలహా మేరకు మెరుగైన వైద్యం కోసం సంబంధిత హాస్పిటల్‌కు పంపుతామని సీఐ రాంబాబు తెలిపారు.